క్లుప్తంగా

మురికి నీటి శుద్ధి కేంద్రానికి స్థలాన్ని పరిశీలించిన జేసీ



స్థలం అనుకూలతపై రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్న జేసీ రాహుల్‌కుమార్

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి వద్ద నిర్మించనున్న మురికి నీటిశుద్ధి కేంద్రం కోసం స్థలాన్ని ఆదివారం ఆర్డీఓ వెంకటరెడ్డితో కలిసి జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ పరిశీలించారు. స్థల అనుకూలతపై అధికారులతో జేసీ చర్చించారు. అయితే మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి గైర్హాజరుపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డోన్, ప్యాపిలి మండలాల తహసీల్దార్‌లు విద్యాసాగర్, చంద్రశేఖర్‌వర్మ, మున్సిపల్ ఏఇ సురేష్, మండల సర్వేయర్ జగదీష్, గ్రామ సర్వేయర్ దాదా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల శుద్ధి అనంతరం భక్తులకు దర్శనం



యాగంటి క్షేత్రంలో శివపార్వతులను దర్శించుకుంటున్న భక్తులు

బనగానపల్లె రూరల్ : పాక్షిక చంద్రగ్రహణం ఆదివారం తెల్లవారు జామున ముగియడంతో మండలంలోని యాగంటి క్షేత్రం, నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయాలను శుద్ధి, సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ఆయా ఆలయాల ఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రామనుజన్, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎంపీపీ

డోన్ : అనారోగ్యంతో బాధపడే వారితో పాటు ఆసుపత్రుల్లో వివిధ శస్త్ర చికిత్సలు చేయించుకునే వారికి సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో ఆదివారం మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన యాపర్ల అపర్ణ కుటుంబ సభ్యుడు సురేష్‌కి రూ.40వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ నాయకులు గుమ్మకొండ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రన్నింగ్ పోటీలలో బేతంచెర్ల క్రీడాకారుడికి ప్రథమ స్థానం



ప్రశంసా పత్రం అందుకుంటున్న సుదర్శన్ రెడ్డి

బేతంచెర్ల: పట్టణానికి చెందిన క్రీడాకారుడు సుదర్శన్ రెడ్డి నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. ఆదివారం ఉదయం సైబరాబాద్, రంగారెడ్డి జిల్లా చందనగర్ పీజేఆర్ స్టేడియంలో జరిగిన నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ 400 మీటర్ల రన్నింగ్‌లో సుదర్శన్ రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈసందర్భంగా క్రీడాకారుడు సుదర్శన్‌రెడ్డిని పట్టణ వాసులు, ప్రముఖులు, తోటి క్రీడాకారులు అభినందించారు.

కరాటే పోటీల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని షాదిఖానా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఎనిమిదవ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో డోన్ పట్టణానికి చెందిన రాం స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. కటాకుమతి విభాగంలో తరుణ్, అభిరామ్ బంగారు వెండి పథకాలు సాధించగా, వర్షిత్ రెడ్డి కాంస, రజత పథకాలు, కటా విభాగంలో సాయి చరణ, మోక్షిత్ ఆనంద్‌రెడ్డి బంగారు వెండి పథకాలు సాధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పోర్ట్స్ కరాటే డు అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రావు, నిర్వాహకులు ప్రభాకర్, శేఖర్, కరాటే మాస్టర్ రమణను సత్కరించారు. విజేతలను అభినందించారు.

8న విద్యా సంస్థల బంద్

డోన్ టౌన్ : కడప ఉక్కు పరిశ్రమ స్థాపన, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు నవంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు హరి, ఇర్ఫాన్ బేగం,అశోక్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం మండల కమిటీ సమావేశం నిర్వహించి బంద్‌పై చర్చించారు.

ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట

- 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత వైఎస్సార్‌దే
- ముస్లింల అభివృద్ధికి చేయూతనిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



కోవెలకుంట్లలో రూ. 1.25 కోట్లతో షాధీఖానా నిర్మించేందుకు చేపట్టిన భూమిపూజలో ముస్లిం పెద్దలతో కలిసి ఫాతెహాలు చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ హర్షవర్ధన్‌రెడ్డి

కోవెలకుంట్ల: ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరవతో కోవెలకుంట్ల పట్టణంలోని ముదిగేడు చౌరస్తాలో నూతనంగా షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు నుంచి రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు ఆదివారం షాదీఖానా నిర్మాణానికి సంబంధించి ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ముందుగా ముస్లిం పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాటసాని ఫాతెహాలు చేశారు. ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గోపిరెడ్డి వెంకటలక్షుమ్మ, మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని తిరుపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, కోఆప్షన్ మెంబర్ దిల్కాబాషా, జిల్లా పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఏ గఫూర్, బీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, న్యాయ విభాగం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్‌లు కల్పించారన్నారు. తండ్రి అడుగుజాడల్లోనే తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, ముస్లిం ఆర్థికాభివృద్ధికి అన్నివిధాలుగా చేయూతనిస్తున్నారని గుర్తు చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముస్లింలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. రెండు నెలల్లో షాదీకానాను అన్ని వసతులతో నిర్మించి ముస్లింలకు అప్పగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎల్వీ సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కెపల్లె రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, గజ్జలరెడ్డి, వీరారెడ్డి, సహదేవరెడ్డి, అక్బర్‌బాషా, శ్రీనివాస్‌నాయక్, జాకీర్ హుశేన్, రసూల్, ఖాశీం, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

లింగాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం: మండలంలోని లింగాల గ్రామంలో దాతల సహకారంతో నిర్మించిన బాలవికాస నీటి శుద్ధీకరణ పథకాన్ని ఆదివారం ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. అంతకు ముందు సర్పంచ్ దండె వెంకటసుబ్బమ్మ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఉపసర్పంచ్ సంజమ్మ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు డీవీ శేషిరెడ్డి, ఏరువ శేషిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఏరువ వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫైబర్ నెట్ సేవలు ప్రారంభం

కోవెలకుంట్ల పట్టణంలో జియో ఫైబర్ నెట్ సేవలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఫైబర్ నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఈశ్వర్ కమ్యూనికేషన్ అధినేత మధు, శివతిరుపతిరెడ్డి, జియో ఫైబర్ నెట్ ప్రతినిధి అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన వివరించారు.

సంజామల: మండలలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట వేళల్లో ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ఆల్వకొండ, ముక్కమల్ల, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, ఎగ్గోని, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, లింగందిన్నె, అక్కంపల్లె, మంగపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 1 గంటల వరుకు, పేరుసోముల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఉదయం 5 నుంచి 12 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

చింతలాయిపల్లెలో బోర్లు ఏర్పాటు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లెలో కొద్ది రోజుల నుంచి నీటి సమస్య ఏర్పడటంతో ఆదివారం రెండు బోర్లు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. గ్రామంలో జనాభా తగ్గట్టుగా తాగునీరు లభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో సమస్యను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే గ్రామానికి బోర్‌వెల్ పంపించి రెండు బోర్లు వేయించారన్నారు. రెండు ఇంచుల మేర నీళ్లు పడ్డాయని ఆయన తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి కుంటుంబానికీ లబ్ధి



లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుంటుంబానికీ లబ్ధి చేకూరిందని, సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గుర్తు చేశారు. మీ కుటుంబానికి ప్రభుత్వం నుంచి న్యాయం జరిగితేనే వైఎస్సార్‌సీపీకిఅండగా నిలువాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజలను కోరారు. మండల పరిధిలోని కానాల గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడపగడప మన ప్రభుత్వం నిర్వహించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలా రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, మహిళ నాయకురాలు పద్మావతమ్మ, సర్పంచ్ పెద్ద పెద్దయ్య, ఎంపీడీఓ నాగకుమార్ తదితర అధికారులతో కలసి ఎమ్మెల్యే కానాలలో విస్తృతంగా పర్యటించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ అన్ని సమాజిక వర్గాల పేదలకు ప్రభుత్వ ఫలాలు అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనిచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం పాలన సాగిస్తున్నారని, ఒక్క కానాల గ్రామానికి నాలుగున్నారేళ్లలో 1197 కుటుంబాలకు రూ. 28 కోట్లు లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. గ్రామంలో రూ.3 కోట్లుతో వివిధ అభివృద్ధి పనులు చేశామని, ప్రజలకు ప్రత్యేక్షంగా పరోక్షంగా దాదాపు రూ.25 కోట్లు అందిందని వివరించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ మండల ఇన్‌చార్జ్ దారెడ్డి ధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కూడాల చంద్ర శేఖర్ రెడ్డి, పులి పుల్లా రెడ్డి, బాల మద్దిలేటి, సర్వేశ్వర్ రెడ్డి, రొక్కం సిమోన్, ఈఓఆర్డీ పాప రాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పరుగుపోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ, ఆర్డీఓ

డోన్ టౌన్ : క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ వెంకటరెడ్డి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మూడు కిలో మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. మండల పరిధిలోని అబ్బిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఉన్న వెంకటాపురం తుమ్మల చెరువు నుంచి నిర్వహించిన పోటీలను డీఎస్పీ, ఆర్డీఓ జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సుధార్‌రెడ్డి, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజష్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ కోర్టు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



అధికారులతో చర్చిస్తున్న సప్తశైల రాజేష్

డోన్ : స్థానిక కొత్త బస్టాండ్ వెనుకాల ఏర్పాటు చేస్తున్న టెన్నిస్ కోర్టు పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, సీఐ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కృషితో ఇప్పటికే పట్టణంలో షటిల్ ఇండోర్ స్టేడియం, టేబుల్ టెన్నిస్, బాల్ బాడ్మింటన్, స్నూకర్, స్విమింగ్ పూల్ నిర్మాణాలు పూర్తయ్యాయని గుర్తు చేశారు. అదేవిధంగా పట్టణంలోని ఏడు పార్కుల్లో సందర్శకుల కోసం వాకింగ్ ట్రాక్, జిమ్, యోగా సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే మంత్రి చేతుల మీదుగా పార్కులను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి, డాక్టర బాల చంద్రారెడ్డి, కౌన్సిలర్ ఆర్ట్ రమణ, కంట్రాక్టరు లోకేష్ పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి

డోన్‌టౌన్ : నంద్యాల పట్టణంలో ఈనెల 31వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరి రక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ఈ నెల 31వ తేదీన మంగళవారం నంద్యాలకు ఉచేరుకుటుందన్నారు. అదే రోజు సాయంత్రం బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ఆశోక్, షేమీమ్ బేగం, అబీబ్‌బాషా, శివరామ్, శ్రీనివాసులు, కుల్లాయప్ప, దేవీలక్ష్మీ,మాదేవి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: సీపీఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఆ పార్టీ నాయకులు బేతంచెర్ల పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, బాలక్రిష్ణ, కిట్టు, మద్దిలేటి, బాషా, మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.

అల్లరిమూకలను అరెస్టు చేయాలి



డోన్ ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

డోన్ టౌన్ : కావలి వద్ద విజయవాడకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ బీఆర్ సింగ్‌పై దాడికి పాల్పడ్డ అల్లరి మూకలను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డోన్ ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. డ్రైవర్‌పై దాడిని వ్యతిరేకిస్తూ ఆదివారం డిపో గేటు ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. అల్లరి మూకలను వెంటనే అరెస్టు చేయాలని జేఏసీ నాయకులు ఐవీఆర్ రెడ్డి, సీతారామిరెడ్డి, బాలమద్దయ్య, మాధవస్వామి, దాస్, రామకృష్ణ, మల్లికార్జున, రమణారెడ్డి డిమాండ్ చేశారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

బనగానపల్లె : కావలి ఆర్టీసీ డిపో డ్రైవర్‌పై జరిగిన దాడికి నిరసిస్తూ ఆదివారం స్థానిక ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, కార్మికులు డిపో ఎదుట నల్లబ్యాడ్జి ధరించి నిరసన తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఎంజీకే కుమార్, ఎస్ఎస్ రాయుడు, శివశంకర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, కేఆర్ మల్లయ్య, భద్రావతి, వైఎస్ఎస్ రెడ్డి, జీఎస్ రావు తదితరులు మాట్లాడారు. దాడి చేసినవారి పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ప్రారంభోత్సవానికి ప్రభుత్వ భవనాలు సిద్ధం



ఒకే ప్రాంతంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు

బేతంచెర్ల: గ్రామాల్లోనే ప్రజలకు నేరుగా మెరుగైన సేవలు అందజేస్తేందుకు ప్రభుత్వం నిర్మిస్తున్న సచివాలయ, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ సెంటర్ భవనాలతో పల్లెలల్లో పట్టణ శోభ సంతరించుకుంది. మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో రూ. 35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 21.80 లక్షలు రైతు భరోసా కేంద్రం, రూ. 17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ. 15 లక్షలతో నిర్మించిన బల్క్ మిల్క్ సెంటర్ భవనాలు ప్రారంభానికి ముస్తాబయ్యాయి. ఒకేచోట నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ సెంటర్ భవనాలు హెచ్ కొట్టాల గ్రామానికి పట్టణ శోభనిస్తున్నాయి. త్వరలో నూతన ప్రభుత్వ భవనాలు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు.

మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం

- జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



పూజలు చేస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రజలు, నాయకుల సహకారంతో నిస్వార్థంగా పని చేసి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. ఆదివారం కొలిమిగుండ్లలోని నాలుగు గుళ్ల ఆలయాల ఆవరణలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.50 లక్షలతో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి జెడ్పీ చైర్మన్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు మంచినీటి సమస్య లేకుండా చేసేందుకు ప్రతి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో మండలానికి జల్‌జీవన్ కింద రూ.20 కోట్లకు పైగానే మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఏడు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు పూర్తి అయ్యాయన్నారు. కొలిమిగుండ్లలో 20 ఏళ్ల క్రితం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించామని, ప్రస్తుతం వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మంచినీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో రెండు చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు మంజూరు చేయించామన్నారు. కొలిమిగుండ్లలోని జగనన్న కాలనీలో 330 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని అక్కడ కూడ ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.61 లక్షలు విడుదల చేసిందని, త్వరలోనే పనులు మొదలవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాముడు, ఎంపీటీసీ సభ్యుడు రమణయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు పేరం సూర్యనారాయణరెడ్డి, నందకిషోర్‌రెడ్డి, ఎంకెనాయుడు, నాగేశ్వరరావు,తిమ్మారెడ్డి,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బనగానపల్లె రూరల్ : మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామం శివారుప్రాంతంలో 27 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామిరెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామ శివారు ప్రాంతంలో ఈశ్వర్, రాజేష్, సుధాకర్ శ్రీనివాసులు, వెంకటరమణ తదితర 27 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. రూ.1.65లక్షలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణ ప్రాంతం పరిశీలన



రైల్వే గేట్ల సమీపంలోని భవన సముదాయాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : పట్టణంలోని కర్నూలు, నంద్యాల రైల్వే గేట్ల వద్ద నిర్మించనున్న అండర్ పాస్ బ్రిడ్జి (భూగర్భ వంతెన) నిర్మాణ ప్రాంతాన్ని ఆదివారం తహసీల్దార్ విద్యాసాగర్, రైల్వే ఎస్ఈ సాయిప్రసాద్‌తో కలిసి ఆర్డీఓ వెంకటరెడ్డి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో స్థిరాస్తులు కోల్పోయే నిర్వాసితుల వివరాలపై ఆరా తీశారు. కోల్పోయే ఆస్తులకు ప్రత్యామ్నాయంగా స్థలం చూపడం లేదా పరిహారం చెల్లింపు ప్రక్రియపై ఆర్డీఓ రైల్వే అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జగదీష్, రైల్వే అధికారి అనీల్ కుమార్, వీఆర్వోలు కృష్ణారెడ్డి, రాజు పాల్గొన్నారు.

మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరానికి తరలివచ్చిన జనం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నంద్యాల గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరి రెడ్డి ప్రతి నెలా ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. డాక్టర్లు గుండె, బీపీ, షుగర్, కంటి, ఊపితిత్తులు తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలి రెడ్డి పాల్గొన్నారు.

రంగాపురంలో ఉచిత వైద్య శిబిరం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో భవిత పబ్లిక్ స్కూల్‌లో కర్నూలు ఆర్ఆర్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు బాల మద్దయ్య, రాహుల్, రోహిత్ రోగులకు వైద్య పరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ప్రభాకర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, నిర్వాహకులు మనోహర్ మధు పుల్లయ్య, నాగార్జున పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం

శ్రీశైలం: శ్రీశైలదేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన ఆర్ వెంకటనాగమల్లేష్ రూ.1,00,001 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆదివారం విరాళాల కేంద్రంలోని ఏఈఓ ఫణిధర ప్రసాద్‌కు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



బనగానపల్లె ప్రభుత్వ అతిథి గృహం నుంచి జీఎం టాకీస్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్

వెలుగుతోన్న 'పల్లె'

బనగానపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లెలు పట్టణాలుగా.. పట్టణాలు నగరాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరువతో బనగానపల్లె నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. నవాబుల కోట బనగానపల్లె ప్రధాన రహదారులు సైతం ఇరుకు రోడ్లతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తేది. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కాటసాని స్థానికులతో చర్చించి రోడ్ల వెడల్పునకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆయన సూచన మేరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న బంకులు, కట్టడాలు స్వచ్ఛందంగా తొలగించుకున్నారు కూడా. దీంతో ప్రభుత్వ అతిథి గృహం నుంచి జీఎం టాకీస్ వరకు ఫోర్‌లైన్స్‌తోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే రూ.8 కోట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన పనులు పూర్తయ్యాయి. విశాలమైన రోడ్లతోపాటు సెంటర్‌లైటింగ్ బనగానపల్లె కాంతులతో మెరుస్తుంది. ఏళ్లతరబడి నెలకొన్న ట్రాఫిక్ సమస్య తీరింది. ఈ రోడ్డు సెంట్రల్ లైటింగ్‌తో వెలుగుతోంది. ఈ మధ్య కాలంలో పల్లెకురాని వ్యక్తులు చూస్తే ఇది ఆ రోడ్డేనా అనే అనుమానం వ్యక్తం చేయాల్సిందే. రోడ్డులో కాంతులు వెదజల్లుతుంటే పట్టపగలను తలపిస్తుంది. అదేవిధంగా విశాలమైన రోడ్డులో వాహనచోదకులు ప్రయాణం సైతం రయ్... రయ్‌గా సాగుతోంది. ఏళ్లతరడి ట్రాఫిక్ సమస్య తో ఇబ్బంది పడిన పట్టణ ప్రజలతోపాటు ఇతర గ్రామస్తులు సైతం రోడ్డు రూపురేఖలు మార్చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



సెంట్రల్ లైటింగ్‌తో మెరుస్తున్న రోడ్డు